# నేడు తుని–పైడికొండ రోడ్డుకు శంకుస్థాపన



రూ.18 కోట్లతో ఆధునీకరించనున్న తుని-పైడికొండ రోడ్డు

**తుని రూరల్:** తుని నుంచి ఎస్.అన్నవరం మీదుగా తొండంగి మండలం పైడికొండ వరకూ రూ.18 కోట్లతో 9.70 కిలో మీటర్ల మేర రహదారి పునర్నిర్మాణ పనులకు బుధవారం రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు ఆర్ అండ్ బీ డీఈ అంబటి ప్రకాశరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. సెంట్రల్ రోడ్ ఫండ్ నిధులతో చేపట్టే పునర్నిర్మాణ పనులకు కాకినాడ ఎంపీ వంగా గీతతో కలసి మంత్రి దాడిశెట్టి రాజా శంకుస్థాపన చేస్తున్నట్టు తుని ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతుల లక్ష్మణ్ తెలిపారు. ఈ రహదారి పనులు పూర్తయితే తుని, తొండంగి మధ్య రాకపోకలు సులభమవుతాయి.




# వైభవంగా కొత్త అమావాస్య వేడుకలు

- నూకాలమ్మను దర్శించిన మంత్రి దాడిశెట్టి రాజా
- గ్రామాల్లో ఉగాది సందడి



ఎస్.అన్నవరంలో నూకాలమ్మ తల్లిని దర్శించుకుంటున్న మంత్రి దాడిశెట్టి రాజా

**తుని రూరల్ :** కొత్త అమావాస్య ఉత్సవాలు తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో మంగళవారం వైభవంగా జరిగాయి. మండలంలోని ఎస్.అన్నవరం, హంసవరం, తేటగుంట, టి.తిమ్మాపురం, చామవరం, వల్లూరు, రేఖవానిపాలెం, దొండవాక, కేఓ.మల్లవరం, డి.పోలవరం, ఎన్ఎస్వీ నగరం తదితర గ్రామాల్లో సోమవారం రాత్రి నూకాలమ్మ అమ్మవారి జాగరణ నిర్వహించారు. మంగళవారం అమ్మవారి దర్శనాలు, తీర్థాలు వైభవంగా జరిగాయి. ఎస్.అన్నవరంలో నూకాలమ్మతల్లిని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా దర్శించుకున్నారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆలరించాయి.

**నూకాలమ్మ అమ్మవారి తీర్థం**

**ఏలేశ్వరం:** లింగంపర్తి గ్రామదేవత నూకాలమ్మ అమ్మవారి తీర్థమహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. పరిసర గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఏలేశ్వరం, రౌతులపూడి ఎంపీపీలు గొల్లపల్లి బుజ్జి, గంటిమళ్ల రాజ్యలక్ష్మి, ప్రత్తిపాడు జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

**పల్లెల్లో సందడి**

**కోటనందూరు:** మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ కొత్త అమావాస్య వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కోటనందూరులో అమ్మవారిని ఎంపీపీ లగుడు శ్రీనివాసు, తుని ఏఎంసీ చైర్మన్ వెలగా వెంకటకృష్ణాజీ, సర్పంచ్ సుర్ల రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు గర్సింగు దొరబాబు, కొరుప్రోలు కృష్ణ తదితరులు దర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

**నూకాలమ్మకు పూజలు**

**రౌతులపూడి:** మండలంలోని ఎస్.పైడిపాల, రౌతులపూడి, పారుపాక, ఎ.మల్లవరం, రాజవరం, ములగపూడి గ్రామాల్లో నూకాలమ్మ అమ్మవారి జాతరను మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

**శంఖవరం:** గ్రామంలోని నూకాలమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ దర్శించుకున్నారు.

**నూకాలమ్మకు ప్రత్యేక పూజలు**

**ప్రత్తిపాడు రూరల్:** మండలంలోని పెద్దిపాలెం గ్రామ దేవత నూకాలమ్మతల్లి అమ్మవారికి జాతర వైభవంగా జరిగింది. అమ్మవారికి పండితుడు చీకట్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గరగ నృత్యాలు, భజనలు, కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

**కిర్లంపూడి:** కొత్త అమావాస్యను పురస్కరించుకుని కిర్లంపూడిలో నూకాలమ్మ తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేలాది సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. తీర్థంలో చిన్నలు, పెద్దలు సందడి చేశారు.

**అంగరంగ వైభవంగా నూకాలమ్మ జాతర**

**తుని:** పట్టణంలోని పాత బజారు వీధిలోని నూకాలమ్మ ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు పోటెత్తారు. మంగళవారం సాయంత్రం అమ్మవారిని ప్రజాప్రతినిధులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రంగురంగుల విద్యుత్ దీపాల కాంతుల్లో భక్తులు కాగడాలు చేతబట్టి సంబరాల్లో పాల్గొన్నారు. తీన్‌మార్, డీజే, గరగల ప్రదర్శనలు అందరినీ అలరించాయి. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ అన్నవరం శ్రీను, కౌన్సిలర్లు అల్లాడ దివాణం, ఆలయ కమిటీ సభ్యులు అన్నవరం శ్రీను తదితరులు అమ్మవారిని దర్శించి పూజలు చేశారు.




నూకాలమ్మను దర్శించేందుకు క్యూల్లో వేచిఉన్న భక్తులు



శంఖవరంలో నూకాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్



కిర్లంపూడి నూకాలమ్మ తీర్థంలో భక్తుల సందడి







# అడవుల పరిరక్షణ అందరి బాధ్యత



సూరంపాలెంలో మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

**గోకవరం:** అడవుల పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని ఫోక్స్‌పేట అటవీశాఖ రేంజర్ ఎం.కరుణాకర్ అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని సూదికొండ రేంజ్ కార్యాలయంలో సిబ్బందికి మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనాలు మానవాళికి రక్షణ కవచాలన్నారు. క్షేత్రస్థాయిలో అటవీ ఉత్పత్తులు సేకరించేవారు వనాలకు నష్టం కలిగించకుండా అటవీశాఖ సిబ్బంది వారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ రాజా, రైటర్ బి.గీత, సెక్షన్ ఆఫీసర్ భూపాల్, సిబ్బంది ప్రశాంత్‌కుమార్, జగదీష్, సీతామహాలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

**అటవీ సంపదను సంరక్షించుకుందాం**

**గండేపల్లి:** అటవీ సంపదను సంరక్షించుకుందామని ఆదిత్య బిజినెస్ స్కూల్ డైరెక్టర్ ఎస్.సుగుణారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య బిజినెస్ స్కూల్ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ అటవీ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంజయ్ కుమార్, ప్రోగ్రాం ఆఫీసర్ గోవర్ధన్ రెడ్డి, ఎ.విజయ భార్గవి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.







# అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

**శంఖవరం:** స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సీడీపీఓ పద్మావతి మంగళవారం తెలిపారు. ప్రాజెక్ట్ పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్త ఒకటి, అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులు ఏడు ఖాళీలు ఉన్నాయన్నారు. 10వ తరగతి పాసైన 21 నుంచి 35 సంవత్సరాల లోపు స్థానిక మహిళలు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 31 లోగా సీడీపీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**ఖాళీల వివరాలు ఇలా...**

రౌతులపూడి మండలం గిన్నెలారం-1 (ఎస్సీ) అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు ఖాళీగా ఉందన్నారు.

**హెల్పర్ పోస్టులు**

శంఖవరం మండలం కత్తిపూడి-1 (ఓసీ ఎక్స్ సర్వీస్‌మెన్), వి.వెంకటాపురం-1 (ఓసీ), రౌతులపూడి మండలం ఎం.చామవరం-1 (బీసీ-ఈ), ప్రత్తిపాడు మండలం యూజీపురం-1 (ఓసీ), బాపన్నధార -1 (బీసీ-డి), ఏలేశ్వరం మండలంలో ఏలేశ్వరం-7 (బీసీ-ఈ), ఏలేశ్వరం-13 (ఓసీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆమె వివరించారు.

# పోలవరం కాలువ భూముల పరిశీలన



పోలవరం కాలువ భూములు పరిశీలిస్తున్న అధికారుల బృందం

**తుని రూరల్:** మండల పరిధిలోని పోలవరం ఎడమ ప్రధాన కాలువ నిర్మాణానికి, డంపింగ్ యార్డులకు సేకరించిన ల్యాండ్ బ్యాంక్ భూములను రెవెన్యూ, హౌసింగ్, ఇరిగేషన్ అధికారులు మంగళవారం పరిశీలించారు. ఆర్డీఓ సీతారామారావు, పోలవరం కాలువ ఈఈ గోవిందు, తహసీల్దార్ జి.బాలసుబ్రహ్మణ్యం, సర్వేయర్ దేవుడు, డీఈ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అధికారుల బృందం మండలంలో పర్యటించింది. తేటగుంట, టి.వెంకటాపురం, కొత్తూరు, తాళ్లూరు, చేపూరు, మర్లపాడు, తదితర గ్రామాల పరిధిలో భూములను, డంపింగ్ యార్డులను సమగ్రంగా తనిఖీ చేశారు. ఇందులో ఇళ్ల స్థలాలకు అనువైన భూముల వివరాలను కలెక్టర్‌కు నివేదిస్తామని అధికారులు పేర్కొన్నారు. ఇరిగేషన్, హౌసింగ్ ఏఈలు పాల్గొన్నారు.




# అరెస్టులకు నిరసనగా న్యాయవాదుల ధర్నా




ప్రత్తిపాడు కోర్టు బయట ధర్నా చేస్తున్న న్యాయవాదులు

**ప్రత్తిపాడు:** న్యాయవాదుల అక్రమ అరెస్టులను నిరసిస్తూ ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు వెలుపల మంగళవారం న్యాయవాదులు ధర్నా చేశారు. విజయవాడలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు సుంకర రాజేంద్రప్రసాద్‌ను గృహ నిర్బంధం, మరో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావును రాజానగరం పోలీసులు అరెస్టు చేపడంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగత శివ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. బార్ కౌన్సిల్ సభ్యులను అరెస్టు చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.బార్ అసోసియేషన్ సభ్యులు రాజాల చిట్టిబాబు, బొంగులూరి మధుబాబు, అవసరాల దేవి, ఆకాశపు మల్లేశ్వరరావు, బెహరా లక్ష్మీ ప్రసన్న, కాకరపల్లి లోవదుర్గ తదితరులు పాల్గొన్నారు.




## 110 హెక్టార్లలో పంట నష్టం



యర్రవరంలో పంటలను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి శ్రీవల్లి

**ఏలేశ్వరం:** అల్పపీడన ప్రభావంతో కురిసిన అకాల వర్షాలకు మండలంలో సుమారు 110 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్టు ప్రాథమికంగా గుర్తించామని ఉద్యానశాఖ అధికారి శ్రీవల్లి తెలిపారు. మండలంలోని యర్రవరంలో వర్షాలకు దెబ్బతిన్న పంటలను మంగళవారం ఆమె పరిశీలించారు. గ్రామాల్లోని వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాలను అంచనా వేస్తున్నట్టు తెలిపారు. పంట నష్టపరిహారం కోసం రైతులు ఆర్‌బీకేల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**దెబ్బతిన్న అరటి తోటల పరిశీలించిన అధికారులు**

**తొండంగి:** మండల పరిధిలోని గ్రామాల్లో అకాల వర్షం, ఈదురగాలులకు దెబ్బతిన్న అరటి తోటలను తుని ఉద్యానవనశాఖాధికారి విజయలక్ష్మి మంగళవారం పరిశీలించారు. శృంగవృక్షం, గోపాలపట్నం, తొండంగి తదితర ప్రాంతాల్లో నేలకొరిగిన అరటి చెట్లను పరిశీలించారు. అరటి, మిరప, కూరగాయాల పంటల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు.

# సామాజిక తనిఖీ ప్రజా వేదిక

**కిర్లంపూడి:** మండలంలో 2021–2022 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఎంపీడీఓ బి.ప్రసాద్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ తనిఖీలో డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, స్టేట్ కో ఆర్డినేటర్ జి.శ్రీకాంత్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గ్రామాల్లో గతేడాది జరిగిన పనులకు సంబంధించిన రికార్డులు తనిఖీ చేశారు. గ్రామాల్లో ఈ నెల 4 నుంచి 20వ తేదీ వరకూ జరిగిన ఉపాధి హామీ పనుల్లో లోపాలు, మొక్కల లెక్కల్లో తేడాలు వంటి పలు సమస్యలను డీఆర్పీలు డ్వామా పీడీ దృష్టికి తీసుకొచ్చారు. ఉపాధి హామీ, పంచాయతీ రాజ్, సర్వశిక్షా అభియాన్, పశువైద్య శాఖ, వాటర్ సప్లయికు సంబంధించి 697 పనులకు గాను సుమారు రూ.10.61 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో అవకతవకలు జరిగినట్టు గుర్తించి రూ.19,125 సిబ్బంది నుంచి రికవరీకి ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అల్లు శివరామకృష్ణ, జగపతినగరం గ్రామ సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత, ఏపీడీ భాను ప్రకాష్, స్టేట్ కోఆర్డినేటర్ జి.శ్రీకాంత్, ఎస్ఆర్‌పీ ఎం.నాగరాజు, ఏపీఓ బి.చిరంజీవిరావు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

**తొండంగి:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2021–22 ఆర్థిక సంవత్సరంలో చేసిన పనులకు సంబంధించి మంగళవారం మండలస్థాయి సామాజిక తనిఖీ నిర్వహించారు. గతేడాది చేపట్టిన పనులు, ఈ ఏడాది గ్రామాల్లో చేపట్టే పనుల వివరాలను డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, ఏపీడీ రమేష్ వివరించారు. వైఎస్ ఎంపీపీ నాగం గంగబాబు, ఎంపీడీఓ పసపులేటి సతీష్, ఈవోపీఆర్ ఆర్డీ ఎన్.సత్యప్రసాద్ పాల్గొన్నారు.



కిర్లంపూడి సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటలక్ష్మి

## నేటి నుంచి జీడి గింజల కొనుగోళ్లు ప్రారంభం



కేఓ మల్లవరంలో పిందె దశలో ఉన్న జీడి గింజలు

- ఆశాజనకంగా పంట
- గిట్టుబాటు ధరపై రైతుల ఆశలు

**తుని రూరల్:** ఉద్యానశాఖ తుని వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో రైతుల నుంచి జీడి గింజలను కొనుగోలు చేసేందుకు వ్యాపారులు సన్నాహాలు చేస్తున్నారు. ఏటా మాదిరిగానే ఉగాది పర్వదినం సందర్భంగా బుధవారం నుంచి జీడి గింజల కొనుగోళ్లను ప్రారంభించనున్నట్టు వ్యాపారులు తెలిపారు. ఈ సంవత్సరం పంట ఆశాజనకంగా ఉండడంతో గిట్టుబాటు ధర్పై రైతులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. గతేడాది 80 కిలోల బస్తా జీడి గింజలు రూ.8,500లతో మొదలై రూ.11 వేలు వరకు అమ్ముడయ్యాయి. తర్వాత రూ.8 వేల వద్ద నిలకడగా క్రయ విక్రయాలు జరిగినట్టు రైతులు తెలిపారు. కొనుగోళ్లు ప్రారంభమైనప్పటికీ మార్కెట్‌కు ఏప్రిల్ నుంచి పంట ముమ్మరం అవుతుందన్నారు. సరైన గిట్టుబాట ధర లభిస్తేనే జీడి గింజలను విక్రయించుకోవాలని రైతులకు ఉద్యాన అధికారి జి.విజయలక్ష్మి సూచించారు.



తుని మండలం మరువాడలో పక్వానికి వచ్చిన జీడి గింజలు

### తొమ్మిది వేల హెక్టార్లలో సాగు

ఉద్యానశాఖ సబ్‌డివిజన్ పరిధిలో తుని, కోటనందూరు, తొండంగి, రౌతులపూడి, శంఖవరం మండలాలు ఉన్నాయి. ఈ ఐదు మండలాల్లో తొమ్మిది వేల హెక్టార్లలో జీడి తోటలు సాగవుతున్నాయి. హెక్టారుకు పది బస్తాలకుపైగా దిగుబడి లభించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈలెక్కన సబ్‌డివిజన్‌లో లక్ష బస్తాల జీడి గింజలు దిగుబడి లభించనుంది.

## కాలువలో పడి వ్యక్తి మృతి

**కిర్లంపూడి:** కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన కొత్తపేటలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తపేటకు చెందిన మోర్త స్వామి (36) గత కొంత కాలంగా ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. సోమవారం రాత్రి కొత్తపేటలో ఉన్న చెరువు కాలువ తూముపై కుర్చున్న స్వామికి ఫిట్స్ రావడంతో కాలువలో పడిపోయి మృతి చెందాడు. మృతుడికి తమ్ముడు, ఇద్దరు అక్కలు, చెల్లి ఉన్నారు. దీనిపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని స్థానిక పోలీసులు తెలిపారు.

## సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి

**జగ్గంపేట:** ఖాతాదారులకు సైబర్ నేరాలపై అవగాహ కల్పించాలని బ్యాంకు మేనజర్లకు జగ్గంపేట ఎస్సై విద్యా సాగర్ సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్లో మండలంలోని పలు బ్యాంకుల మేనజర్లతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. సైబర్ నేరాలు అరికట్టేందుకు జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు ప్రత్యేక చర్యలు తీసుకున్నారని తెలిపారు.

## పేకాడుతున్న నలుగురి అరెస్టు

**జగ్గంపేట:** మండలంలోని మామిడాడ గ్రామ శివారులో పేకాట శిబిరంపై మంగళవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.1500 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై విద్యా సాగర్ తెలిపారు.

## ఎంపీ కృషితో వర్సిటీ అభివృద్ధి



ఎంపీ వంగాను అభినందిస్తున్న వీసీ ప్రసాదరాజు. చిత్రంలో శ్యామ్‌కుమార్, మాలోతు రమేష్

**బాలాజీచెరువు:** జేఎన్‌టీయూకే స్టేడియం అభివృద్ధికి ఎంపీ వంగా గీత కృషి అభినందనీయమని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు పేర్కొన్నారు. ఖేలో ఇండియాలో భాగంగా 400 మీటర్ల సింథటిక్ అథ్లెట్ ట్రాక్ మంజూరుకు కృషి చేసిన ఎంపీ గీతను వీసీ ప్రసాదరాజు ఆమె స్వగృహంలో మంగళవారం అభినందించారు. ట్రాక్ పరిశీలనకు డీఎస్‌వీ వినయ ప్రసాద్, హరీష్, ఖాజా షరీఫ్‌ల బృందం పరిశీలించింది. ఎంపీ గీతను అభినందించిన వారిలో స్పోర్ట్స్ కౌన్సెల్ కార్యదర్శి డాక్టర్ శ్యామ్ కుమార్, ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ మాలోతు రమేష్ ఉన్నారు.

## పంచాంగం ఆవిష్కరణ

**కాకినాడ రూరల్:** రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో తెలుగు నూతన సంవత్సర పంచాంగాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక వేత్త వేదుల శ్రీరామ శర్మ మాట్లాడుతూ శ్రీ శోభకృత్ నామ సంవత్సరంలో అందరికి శభ ఫలితాలు లభిస్తాయన్నారు. విశాఖపట్నానికి చెందిన వేద పండితుడు అడబాల సత్యనారాయణ కుటుంబ సభ్యులు పంచాంగ కర్తలుగా పంచాంగాలు ప్రచురించడం అభినందనీమన్నారు. అడబాల ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్, ప్రముఖ సిద్ధాంతి అడబాల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## కుండపోత వాన

**కాకినాడ రూరల్:** కాకినాడ, పరిసర గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం ఉన్నట్టుండి కుండపోతగా వర్షం పడింది. సుమారు అరగంట పాటు ఏకధాటిగా పడిన వర్షంతో పల్లపు ప్రాంతాలు, రోడ్లు జలమయమయ్యాయి. ఎంపీడీఓ కార్యాలయం వీధిలో నీరు సిమెంట్ రోడ్డుపై నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు.

## పారిశుధ్యంపై నిర్లక్ష్యం వద్దు

**కాకినాడ:** పారిశుధ్య నిర్వహణలో అలసత్వంపై కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన 38వ డివిజన్ గొల్లపేట, 43వ డివిజన్ వాటర్ ట్యాంక్ ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. కొన్ని చోట్ల తొలగించిన చెత్తను తరలించకపోవడాన్ని గమనించారు. మరికొన్ని చోట్ల సిబ్బంది నిర్లక్ష్యాన్ని గుర్తించారు. దీనిపై ఆయన 43వ డివిజన్ శానిటరీ సెక్రటరీ గారికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. అలాగే 38వ డివిజన్ శానిటరీ సెక్రటరీ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనితీరు మెరుగుపరుచుకోకపోతే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవివర్మ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



# మార్కెట్‌లో వసతుల కరవు


యర్రవరం మార్కెట్‌లో ఎండలో ఉన్న అరటిగెలలు

- అభివృద్ధికి నోచుకోని అరటిమార్కెట్
- ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు
- నీడలేక ఇబ్బందులు పడుతున్న రైతులు

**ఏలేశ్వరం:** మండలంలోని యర్రవరంలో జాతీయరహదారిని ఆనుకుని ఉన్న అరటి మార్కెట్‌లో ప్రతిరోజూ వేలల్లో అరటిగెలల కొనుగోలు, అమ్మకాలు జరుగుతాయి. ఇతర రాష్ట్రాలకు సైతం ఇక్కడ నుంచి అరటి గెలలను ఎగుమతు చేస్తారు. వందలాది మంది రైతులు, వ్యాపారులు ఇక్కడకు వస్తారు. కాగా మార్కెట్‌లో రైతులకు నిలువ నీడ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

### ఎకరం స్థలంలో మార్కెట్

నియోజకవర్గంలోని ఏలేశ్వరం, జగ్గంపేట, కిర్లంపూడి మండలాలకు చెందిన అనేక గ్రామాల రైతులు యర్రవరం మార్కెట్‌లో అరటిగెలల అమ్మకాలు సాగిస్తుంటారు. ప్రతిరోజూ ఎడ్లబండ్లు, వ్యాన్లు, ఆటోలు, మోటారుబైక్‌లపై అరటిగెలలను మార్కెట్‌కు తీసుకువస్తారు. సుమారు ఎకరం స్థలంలో మార్కెట్‌ను కొనసాగిస్తున్నారు. ఇక్కడ నుంచి ఒడిశా, కటక్, భువనేశ్వర్, రూర్కేలా తదితర ప్రాంతాలకు అరటిగెలలు ఎగుమతి చేస్తారు. దీంతో పాటు జాతీయ రహదారిపై చిరువ్యాపారులు వాహనదారులకు అరటి పండ్లను విక్రయిస్తుంటారు.


ఇతర ప్రాంతాలకు తరలించేందుకు లారీల్లోకి లోడ్ చేస్తున్న అరటిగెలలు

### మార్కెట్‌లో పలురకాల గెలలు

మెట్టప్రాంతంలో ఎక్కువ మంది రైతులు అరటిసాగు చేస్తారు. దీంతో పలురకాల గెలలు యర్రవరం మార్కెట్‌లో అందుబాటులో ఉంటాయి. మార్కెట్‌లో కర్పూరం, చక్రకేళి, అమృతపాణి, బుసావళి తదితర గెలలు దొరుకుతాయి. వీటిధరలు కూడా అందుబాటులో ఉండడంతో కొనుగోలుదారులు ఆసక్తి చూపుతారు. రైతులు మార్కెట్‌కు తెచ్చిన గెలలను చిరువ్యాపారులు కొనుగోలు చేసి లారీల్లో ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తుంటారు.

### రైతుల ఇక్కట్లు

నిత్యం రైతులతో కళకళలాడే అరటిమార్కెట్‌లో వసతులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఎండకాలం ప్రారంభం కావడంతో రైతులతో పాటు అరటిగెలలకు ఎండదెబ్బ తప్పడం లేదు. అలాగే వర్షాలు పడితే మార్కెట్ ప్రాంగణమంతా బురదమయంగా మారడంతో అరటి గెలలు ఉంచేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే రైతులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండలోనే ఉండవల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మార్కెట్‌లో షెడ్లు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి వెంకటరామరాజువర్మను వివరణ కోరగా షెడ్ల నిర్మాణంపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు.

### షెడ్లు ఏర్పాటు చేయాలి

మార్కెట్‌లో షెడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఎండలో అరటి గెలలను ఉండడంతో ఎండిపోతున్నాయి. షెడ్లు ఏర్పాటు చేస్తే గెలలు పాడవకుండా ఉంటాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మార్కెట్లో వసతులు కల్పించాలి.

– అంజూరి రాజారావు, రైతు ఏలేశ్వరం



## ఆసియా లాయర్ల క్రికెట్ టోర్నీకి వెంకటేష్

**నాగమల్లితోట జంక్షన్:** శ్రీలంకలోని కొలంబియాలో ఈ నెల 31 నుంచి ఏప్రిల్ ఐదు వరకు జరిగే ఆసియా లాయర్ల క్రికెట్ టోర్నీకి కాకినాడకు చెందిన సక్కా వెంకటేష్ ఎంపికయ్యారు. సౌత్ ఇండియా లాయర్ల క్రికెట్ జట్టులో కాకినాడ బార్ అసోసియేషన్ సభ్యులు వెంకటేష్‌కు చోటు దక్కడం చాలా ఆనందంగా ఉందని బార్ అసోసియేషన్ ఏపీ అధ్యక్షుడు పి.సురేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. కాకినాడ బార్ అధ్యక్షుడు ఏలూరి సుబ్రహ్మణ్యం, న్యాయవాదులు వెంకటేష్‌ను అభినందించారు.


వెంకటేష్

## రత్నగిరిపై ఉగాది వేడుకలకు సర్వం సిద్ధం


సత్యదేవుని ప్రధానాలయం ముందు చేసిన పుష్పాలంకరణ

**అన్నవరం:** రత్నగిరిపై 'శోభకృత్ ' నామ సంవత్సర ఉగాది వేడుకలకు సర్వం సిద్ధమైంది. సత్యదేవుని ఆలయం, ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయ ప్రాంగణాన్ని వివిధ పుష్పమాలలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. అనివేటి మండపంలో పంచాంగ శ్రవణం జరిగే ప్రదేశంలో చేసిన పుష్పాలంకరణ ఆకట్టుకుంటోంది.


అనివేటి మండపంలో చేసిన పుష్పాలంకరణ


విద్యుత్ కాంతుల నడుమ తూర్పు రాజగోపురం

## మహనీయుడు శోభనాద్రి : ఎంపీ గీత

**బోట్‌క్లబ్:** స్థానిక పెదమార్కెట్ బంగారు చిన్నశోభనాద్రి సత్రం 99వ వ్యవస్థాప దినోత్సవం మంగళవారం సత్రం ఆవరణలో నిర్వహించారు. ఎంపీ వంగా గీత కార్యక్రమానికి హాజరై శోభనాద్రి చిత్రపటానికి నివాళులర్పించారు. పేదల కోసం ఆలయాలు, సత్రాలు నిర్మించిన శోభనాద్రి ప్రజలు గుండెల్లో ఎప్పటికీ నిలచి ఉంటారన్నారు. 1924లో ఈ సంస్థ స్థాపించి నిరుపేదలు కోసం తన ఆస్తిని సత్రానికి రాసి ఇచ్చిన ఆయన మహనీయుడన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ దాత ఆశయానికి అనుగుణంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సంస్థ ప్రాంగణంలో కల్యాణ మండపం నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం పేదలకు దుప్పట్లు, మహిళలకు చీరలు, భారీ ఎత్తున అన్నదానం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ వాసిరెడ్డి రాంబాబు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా ఛైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మాజీ కార్పొరేటర్లు రోకళ్ల సత్యనారాయణ, నల్లబిల్లి సుజాత, వైఎస్సార్‌సీపీ నాయకుడు సుంకర విద్యాసాగర్, దేవదాయశాఖ తనిఖీదారు వడ్డి ఫణికుమార్, ఈఓ అడబాల శ్రీనివాస్ పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ గీత, చిత్రంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

# వనరుల సంరక్షణ అందరి బాధ్యత

- జాయింట్ కలెక్టర్ ఇలక్కియ
- నాబార్డ్ ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవం


అతిథులతో కలసి కాంపెండియంను ఆవిష్కరిస్తున్న జేసీ ఇలక్కియ

**కాకినాడ సిటీ:** మనిషి మనుగడకు ముఖ్యమైన జల వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని జేసీ ఎస్ ఇలక్కియ అన్నారు. మార్చి 22న ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని నాబార్డ్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ విధాన గౌతమి మందిరంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జలవనరుల సంరక్షణ, పారిశుద్ధ్యం, పరిశుభ్రత తదితర అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకొని, ఆ దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. వీటిని సామాజిక బాధ్యతగా పాటించడం ద్వారా ఆరోగ్యకర వాతావరణాన్ని సృష్టించవచ్చని పేర్కొన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హైడ్రాలజీ డెల్టా పరిశోధన శాఖ డైరెక్టర్ సత్యాజీరావు వాతావరణ మార్పులతో గోదావరి డెల్టా భూగర్భ జలవనరుల్లో పెరుగుతున్న లవణీయత, ఇతర అంశాలను వివరించారు. నాబార్డు డీడీఎం డాక్టర్ వైఎస్ నాయుడు, వ్యవసాయ, అనుబంధ రంగాలపై వాతావరణ మార్పుల ప్రభావం, అదే విధంగా ఈ మార్పుల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు నాబార్డు చేపడుతున్న వివిధ కార్యక్రమాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జల వనరులు, వాతారవణ మార్పుల ప్రభావంపై రూపొందించిన కాంపెండియంను అతిధులతో కలసి జేసీ ఆవిష్కరించారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ, భూగర్భ జలవనరులు, నీటి పారుదలశాఖ తదితర శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కబడ్డీలో విద్యార్థుల ప్రతిభ

**కొత్తపల్లి:** పెద్దాపురం మండలం దివిలి చంద్రమాంపల్లిలోని జెడ్పీ పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో వాకతిప్ప జెడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కనపర్తి నూకరాజు తెలిపారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్ఎం జిలాని స్మారక కబడ్డీ పోటీలు ఈనెల 17 నుంచి 3 రోజుల పాటు నిర్వహించగా వాకతిప్ప చైతన్య కబడ్డీ క్లబ్ జట్టు ప్రతిభ కనపరిచి ద్వితీయ స్థానం సాధించడంతో పాటు రూ.8వేలు నగదు, ట్రోఫీని సాధించారు. విద్యార్థులను ఎంఈఓ వేణుగోపాల్ అభినందించారు.

## పంచభూతాల పరిరక్షణకు కృషి చేద్దాం


నీటి సంరక్షణపై వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సమితి అధ్యక్షురాలు సురేఖ, సభ్యులు

**బాలాజీచెరువు:** పంచ భూతాలను పరిరక్షించుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని ధరిత్రి రక్షిత సమితి అధ్యక్షురాలు సీమకుర్తి సురేఖ పేర్కొన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా మంగళవారం నీరే ప్రాణం అనే అంశంపై స్థానిక లోటస్ అకాడమిలో అవగాహన సదస్సు నిర్వహించారు. సురేఖ మాట్లాడుతూ భూమిపై ముడొంతుల నీరు ఉన్నా 2.7 శాతమే పరిశుభ్రమైన నీరు ఉందన్నారు. ఈ ఏడాది ఐక్యరాజ్య సమితి 'నీరు–పారిశుద్ధ్య సంక్షోభాన్ని పరిష్కరించడానికి మార్పు వేగవంతం చేయడం' అనే అంశంపై నినాదంగా నిర్ణయించారన్నారు. జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ డాక్టర్ ఆలపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రపంచంలో 500కు పైగా నదులు కలుషితం చేస్తున్నామని, ఏటా 40 లక్షల మంది కలుషిత నీటి వల్ల చనిపోతున్నారన్నారు. అనంతరం విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి క్లాత్ సంచులు పంపిణీ చేశారు. సమితి కోశాధికారి సీమకుర్తి మురళి, సభ్యులు కృష్ణకుమార్, కృష్ణ మనోహర్, జేఎన్‌టీయూకే విద్యార్థులు పాల్గొన్నారు.

## లాభసాటి వ్యవసాయమే ప్రభుత్వ లక్ష్యం

- రైతుపక్షపాతి సీఎం జగన్
- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు

**కరప:** సంక్షేమ పథకాలతో ఆదుకోవడమే కాకుండా, పంటకు గిట్టుబాటు ధర కల్పించి, వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు అన్నారు. గొర్రిపూడిలో మంగళవారం వైఎస్సార్ ఎత్తిపోతల పథకం పరిధిలోని ఐదు గ్రామాల రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయంగా ప్రతి రైతుకు ఏడాదికి రూ.13,500 ఆర్థికసాయం, ఉచిత పంటల బీమా పథకం, రాయితీపై యంత్రపరికరాల పంపిణీలతోపాటు ఆర్‌బీకేలను ఏర్పాటు చేసి రైతులకు సాగు మెళకువలపై అవగాహన కల్పించి, ఎరువులు, పురుగు మందులు సకాలంలో అందజేస్తున్నారంటే సీఎం జగన్ రైతు పక్షపాతి అనిచెప్పడానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలని ప్రశ్నించారు. గొర్రిపూడిలోని ఎత్తిపోతల పథకం పని చేయక సాగునీరు అందడంలేదని చీకాల సుబ్బారావు, చీకాల అప్పరాజు అడగడంతో పైపులైన్, పంపుసెట్లు, ఇతర మరమ్మతులకు కలెక్టర్ కృత్తికాశుక్లా ద్వారా రూ.40 లక్షలు మంజూరుచేయించినట్టు తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల ఎత్తిపోతల పథకాల సమాఖ్య అధ్యక్షుడు సోమన్న చౌదరి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 21, ఏజన్సీలో 25 ఉన్న ఎత్తిపోతల పథకాలకు ప్రభుత్వంపై ఆధారపడకుండా రైతులు భాగస్వామ్యంతో నిధిని ఏర్పాటు చేసుకుంటే అవి ఆగిపోకుంగా నిర్వహించుకోవచ్చన్నారు. మరికొన్ని గ్రామాలకు పైప్‌లైన్ పొడిగించి, లైనింగ్ పనులు చేయించాలని కోరగా, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కన్నబాబును రైతుల తరఫున చీకాల సుబ్బారావు, అప్పలరాజు సోదురులు ఘనంగా సత్కరించారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చీకాల సుబ్బారావు, పెనుగుదురు పీఏసీఎస్ మాజీచైర్మన్ అప్పలరాజు, కె.వీరబాబు, జల్దాని ఏసుగంగాధర్, ఎత్తిపోతలపథకం డీఈఈ పి.సత్యానారాయణ, ఏఈఈ వి.నారాయణరావు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు రైతులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పేదరిక నిర్మూలనకు శిక్షణ దోహదం


శిక్షణ ముగింపు సందర్భంగా ధ్రువపత్రాలు అందజేస్తున్న కృష్ణమోహన్ తదితరులు

**సామర్లకోట:** గ్రామాల్లో పేదరిక నిర్మూలనకు రెండు రోజుల పాటు ఇచ్చిన శిక్షణ దోహదపడాలని పంచాయతీ రాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ అదనపు కమిషనర్ కృష్ణమోహన్ అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామ రాజు, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లోని ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ, సీనియర్ పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమానికి మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సుస్థిర లక్ష్యాల సాధనపై ఇచ్చిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేదరికం లేని గ్రామం, జీవనోపాధులు, ఆరోగ్యవంతమైన గ్రామం తదితర అంశాలపై ఫ్యాకల్టీలు ఎన్ఐఆర్‌డీ డైరెక్టర్ మధుసూదన్, శ్రీదేవి, లలిత, శ్రీనివాస్, కెజియా, సుబ్బారావు, పి.శ్రీనివాస్‌లు శిక్షణనిచ్చారు. శిక్షణ ముగింపు సందర్భంగా టీఓటీలకు ధ్రువపత్రాలు అందజేశారు.

## విధులు బహిష్కరించిన న్యాయవాదులు

**పెద్దాపురం:** బెజవాడ బార్ అసోసియేషన్‌లో న్యాయవాదిపై జరిగిన దాడిని నిరసిస్తూ మంగళవారం పెద్దాపురం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. విజయవాడలో న్యాయవాది ఆత్మూరి వెంకట భగవాన్‌పై దాడి, రాజమహేంద్రవరంలో బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు అరెస్టులకు నిరసనగా విధులు బహిష్కరించినట్లు పెద్దాపురం బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వేదుల సుబ్రహ్మణ్యం, కందుల నరేష్‌కుమార్‌లు తెలిపారు. కార్యక్రమంలో రాయుడు, ఏవీ జనార్దన్, మడికి రాంబాబు, కందుల వెంకటాచలం పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఘనంగా డౌన్ సిండ్రోమ్ డే

ఏలేశ్వరం: ప్రపంచ డౌన్ సిండ్రోమ్ డేను పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక భవిత కేంద్రంలో టీచర్లు వాణిపద్మజ, సరస్వతి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి దివ్యాంగులకు స్వీట్లు పంచిపెట్టారు. దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులతో అవగాహన సమావేశం నిర్వహించారు. అనంతరం పట్టణంలో అవగాహన ర్యాలీ చేశారు.

### వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: కొత్త అమావాస్యను పురస్కరించుకుని రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి మంగళవారం ప్రత్యంగిర హోమం నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు యనమండ్ర శర్మ, కంచిబట్ల రామ్‌కుమార్, చిట్టిం వాసు, చల్లపల్లి ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. 20 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

### ఎస్ఈబీ దాడుల్లో ముగ్గురి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) పరిధిలో మంగళవారం నిర్వహించిన దాడుల్లో మద్యం, సారాతో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. ఏలేశ్వరం మండలం సిరిపురంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న దుంగ సురేష్‌ను అరెస్టు చేసి అతని నుంచి 12 మద్యం (180 ఎంఎల్) సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెంలో సారా స్థావరాలపై దాడులు నిర్వహించి, సారా తయారీకి సిద్ధం చేసిన 100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. అదే గ్రామంలో పరారీలో ఉన్న సారా విక్రేత బెజవాడ వీరబాబును అదుపులోకి తీసుకున్నారు. ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో ఐదు లీటర్ల సారాతో బొంతు వరలక్ష్మిని అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ సీఐ అశోక్ వివరించారు

# ఆరోగ్యప్రదాయిని రాగి జావ

ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకంలో నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తోంది. ఈ మేరకు పిల్లలకు అందించే మధ్యాహ్న భోజన పథకం మెనూలో మార్పులు సైతం చేసింది. బాల బాలికల్లో రక్తహీనత లోపాన్ని నివారించేందుకు విద్యార్థులకు రాగి జావ అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు రాగ జావ పంపిణీని మంగళవారం ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు.

తుని/తునిరూరల్/తొండంగి/కోటనందూరు/ఏలేశ్వరం/ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్/రౌతులపూడి/జగ్గంపేట/గండేపల్లి/గోకవరం/కిర్లంపూడి/శంఖవరం



శంఖవరంలో విద్యార్థులకు రాగి జావ అందిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

### విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

విద్యార్థుల ఆరోగ్యప్రదాయని రాగి జావ అని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. శంఖవరం ప్రాథమికోన్నత పాఠశాల్లో విద్యార్థులకు రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. సుమారు రూ.80 కోట్లతో విద్యార్థులకు రాగి జావ అందిస్తోందన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటే మంచి జ్ఞానాన్ని పొందుతారన్నారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజబాబు, జెడ్పీటీసీ తరుం రాజేశ్వరి, ఎంపీడీఓ జె.రాంబాబు, ఎంఈఓ ఎస్‌వీ రమణ, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఈగల అప్పారావు, సర్పంచ్ బందిలీ గనియమ్మ పాల్గొన్నారు.

### మండలాల వారీగా..

తుని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ పంపిణీని ఎంపీపీ ఎంపీపీ బొప్పన రాము ప్రారంభించారు. తుని మండలం ఎస్ అన్నవరం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వైస్ ఎంపీపీ చోడిశెట్టి, ఎంఈఓ పరవాడ గీతాదేవితో కలిసి రాగిజావ పంపిణీ చేశారు. ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ పంపిణీని జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా



రౌతులపూడిలో విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం

రాజరాజేశ్వరి, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ ప్రారంభించారు. ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎంపీయూపీ స్కూళ్లలో విద్యార్థులకు రాగి జావ పంపిణీని వైఎస్సార్ సీపీ మండల నేత రామిశెట్టి చినబాబు ప్రారంభించారు. ఏలేశ్వరం పట్టణంలోని ఎంపీపీ, జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి రాగిజావ పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు అలమండ చలమయ్య, శిడగం వెంకటేశ్వరరావు, తొండారపు రాంబాబు తదితరులు పాల్గొన్నారు. తొండంగి జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు రాగి జావ పంపిణీనివైఎస్ ఎంపీపీ నాగం గంగబాబు, ఎంపీపీ అంగుళూరి అరుణ్‌కుమారి సతీమణి అంగుళూరి సుశీల, ఎంఈవో షేక్‌బాబ్జి ప్రారంభించారు. బెండపూడి జెడ్పీ హైస్కూల్లో వైఎస్సార్ సీపీ యూత్ కన్వీనర్ ఆరుమిల్లి ఏసుబాబు విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేశారు. రౌతులపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, ఎంపీపీ రాజ్యలక్ష్మి విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, డీసీసీబీ డైరెక్టర్



ప్రత్తిపాడులో విద్యార్థినికి రాగిజావ ఇస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు రాజరాజేశ్వరి

పులి మధు పాల్గొన్నారు. కోటనందూరు జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు ఎంపీపీ లగుడు శ్రీనివాసు రాగిజావ పంపిణీ చేశారు. గోకవరం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ రాగిజావ పంపిణీ చేశారు. గండేపల్లి మండలం మండలం మురారి హైస్కూల్‌లో విద్యార్థులకు ఎంపీపీ చలగళ్ల దొరబాబు రాగి జావ పంపిణీ చేశారు.

కిర్లంపూడి మండలం వీరవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎంపీపీ తోట రవి, తోట గాంధీ రాగిజావను పంపిణీ చేశారు. జగ్గంపేట మండలం కాట్రావులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం ప్రారంభించారు



ఏలేశ్వరంలో విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్యవతి



తునిలో విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేసిన నాయకులు

### నేడు మంత్రి రాజా పర్యటన

తొండంగి: మండల పరిధిలోని గ్రామాల్లో బుధవారం రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా పర్యటిస్తారని వైస్ ఎంపీపీ నాగం గంగబాబు మంగళవారం తెలిపారు. ఉదయం10 గంటలకు శృంగవృక్షంలో సీసీ రోడ్ల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేస్తారన్నారు. అనంతరం ఒంటిమామిడిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.